పశువులకు గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధికి ముందుగా టీకాలు వేయించడం వల్ల నివారించ వచ్చునని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.అనిత అన్నారు. వల్లూరు, కోరుమిల్లి గ్రామాల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వల్లూరు గ్రామంలో 281 పశువులకు, కోరుమిల్లి గ్రామంలో 400 పశువులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాల్లో పశువైద్యాధికారులు డాక్టర్ వి.వి.రమణమూర్తి, డాక్టర్ లక్ష్మీకుమారి, గ్రామ సర్పంచ్ దాసి మీనా కుమారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడి అనిత

కష్టం బారెడు... జీతం మూరెడు

- అరకొర వేతనమే దిక్కు
- మూడు నెలలుగా పెండింగ్
- దుర్భర జీవితాలను అనుభవిస్తున్న వైనం
- పాఠశాల పారిశుధ్య కార్మికుల వెతలు

పాఠశాలల్లో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన విద్యా విధానాలను ప్రవేశపెట్టి పలువురు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పాఠశాలల విలీనం పేరుతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పాఠశాలల పారిశుధ్య కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయి. తల్లికి వందనం రూ.15 వేలు ఇస్తున్నామని చెప్పి అందులో రూ.2 వేలు కోత విధిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ పేరుతో ఈ సొమ్మును మినహాయిస్తున్నప్పటికీ అందుకోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. దీనిలోభాగమే పారిశుధ్య కార్మికులకు అరకొర వేతనాలను మాత్రమే అందిస్తుంది. పాఠశాలలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న వారి సమస్యలను పాలకులు గాలికొదిలేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,110 ప్రాథమిక, 214 ప్రాథమికోన్నత, 200 ఉన్నత పాఠశాలల్లో సుమారు 4,200 మంది పని చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం పారిశుధ్య కార్మికులను నియమించారు. 300 మందికి లోపు విద్యార్థులు ఉంటే ఒక ఆయాను, 301 నుంచి 600 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు, 601 నుంచి 900 మందికి ముగ్గురు, 900 పైగా విద్యార్థులు ఉంటే నలుగురిని నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది పాఠశాలలు తెరిచే ముందే తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఆయాలను నియమించుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకే వారికి గతంలో నెలకు రూ.2 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకైతే రూ.2,500, ఉన్నత పాఠశాలలో పనిచేసేవారికి వారికి రూ.4 వేలు గౌరవ వేతనంగా నిర్ణయించి అందించేవారు. గత విద్యా సంవత్సరం నుంచి అందరికీ రూ.6 వేలు ఇస్తున్నారు.

కుటుంబ పోషణ ఎలా..?

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు నియమించిన ఆయాలకు అరకొర వేతనాలను మాత్రమే ఇస్తున్నారు. రూ. 6 వేలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం తమకు కనీస వేతనాలను అమలు చేయాలంటూ కోరుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరం పాఠశాలలను అంటూ పెట్టుకుని పారిశుధ్య సేవలు వీరు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వకపోవడంతో కనీస వేతనాలకు నోచుకోవడం లేదు. అవి కూడా మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

తగినన్ని నిధులున్నా...

ఒక్కొక్క ఆయాకు నెలకు రూ.6 వేల ప్రకారం ఏడాదికి 10 నెలలు గౌరవ వేతనం ఇస్తున్నారు. తల్లికి వందనంలో కోత విధిస్తున్న ప్రభుత్వం ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేల వరకూ పక్కన ఉంచుతోంది. కానీ ఇప్పటికీ ఈ నిధుల నుంచి ఆయాలకు వేతనం చెల్లించడం లేదు. తగినన్ని నిధులు ఉన్నా జిల్లా విద్యాశాఖ అధికారులు వేతనాలు చెల్లించకపోవడం నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కావున ప్రభుత్వం కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్లు ఆయాల నుంచి వినిపిస్తున్నాయి.

కనీస వేతనాలు ఏవీ?

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఏళ్లుగా పని చేస్తున్నాం. ఇచ్చే అరకొర వేతనాలు ఎప్పుడూ పెండింగ్‌లోనే ఉంటున్నాయి. కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం జరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- ఎన్.సునీత, ఎంపిపి పాఠశాల, కొండెవరం, యు.కొత్తపల్లి మండలం

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి

గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఇచ్చే అరకొర వేతనాలు సరిపోవడం లేదు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. గ్లౌజులు, యాప్రాన్ మాత్రమే ఇస్తున్నారు. బూట్లు ఇతర రక్షణ పరికరాలు ఇవ్వడం లేదు. కళ్ళు మండిపోతున్నాయి.

-గండేపల్లి సత్యవతి, పాఠశాల పారిశుధ్య కార్మికురాలు, పిఠాపురం

కనీస వేతనం ఇవ్వాలి

నిరంతరం పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న కార్మికులకు జిఒ 07 ప్రకారం కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి. చదరపు గజాలను బట్టి పాఠశాలలకు వర్కర్లను నియమించాలి. స్కూల్ అభివృద్ధి కమిటీ పలు చోట్ల ఇష్టానుసారంగా మారుస్తున్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి.

-చంద్రమళ్ళ పద్మ, సిఐటియు నాయకురాలు

ముందుకు సాగని సర్వీస్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక నాలుగు లైన్ల 216ఎ జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు మంజూరైన పనులు మొదలు పెట్టేందుకు ఆక్రమణలు తొలగించడానికి అన్ని అవరోధాలే. నిజానికి ఈ సర్వీస్ రోడ్డు మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర మంజూరు కాగా నిర్మించనున్నారు. తొలుత ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా వారు మొదలు పెట్టేందుకు రావడం గ్రామస్తులు అడ్డుకోవడం రోజూ పరిపాటయింది. అయితే ఇది రోడ్డు మార్జిన్ వైట్ గీత నుంచి 12 మీటర్ల వరకు ఈ సర్వీస్ రోడ్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జెసిబితో ఆయా ప్రదేశాలను శుభ్రం చేయడానికి సమా యత్తం కావడం గ్రామస్తులు నిలుపుదల చేయడం జరుగుతుంది. అయితే మొత్తం 12 మీటర్లలో ప్రస్తుత రోడ్డుకు మార్జిన్‌గా మీటరు, ఆ తర్వాత 8.5 మీటర్లు సర్వీస్ రోడ్డు నిర్మిస్తారు. అక్కడ నుంచి మీటర్నర వెడల్పుతో డ్రైనేజీ నిర్మాణం ఆ తర్వాత మరో మీటరు విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కేటాయిస్తారు. ఇలా 12 మీటర్ల వెడల్పుతో ఈ సర్వీస్ రోడ్డు ఉంటుంది.

చెముడులంక వద్ద ఆక్రమణలు తొలగింపునకు వచ్చిన జెసిబిని అడ్డుకున్న గ్రామస్తులు

మంగళవారం చెముడులంకలో ఆక్రమణల తొలగింపుకు సంబంధించి జెసిబితో కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు రాగా ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. మాకు నష్ట పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేసేది లేదన్నారు. మా నివాసాల పరిధిలో జాతీయ రహదారికి ఆరున్నర మీటర్లు మాత్రమే స్థలం ఉందని మిగిలిన ఐదున్నర మీటర్లకు నష్టపరిహారం ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. అలాగే స్థానికంగా జాతీయ రహదారి దాటి బడుగువానిలంక వెళ్లడానికి డివైడర్ లేదని దానిని తప్పక ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని జాతీయ రహదారి అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

19, 20 తేదీల్లో లేఖర్ల పెన్‌డౌన్

ప్రజాశక్తి - అమలాపురం

దస్తావేజు లేఖర్ల ఈ నెల 19, 20వ తేదీల్లో చేపట్టే పెన్‌డౌన్ నిరసన కార్యక్రమానికి క్రయ విక్రయదార్లు సహకరించాలని దస్తావేజు లేఖర్లు సమావేశం కోరింది. ముందుగా జిల్లా అమలాపురం దస్తావేజు లేఖర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మంగళవారం సమావేశం జరిగింది.

దస్తావేజు లేఖర్ల నూతన కార్యవర్గం

దస్తావేజు లేఖర్ల సంఘ గౌరవ అధ్యక్షులుగా గుంటు ఫణిప్రసాద్, ప్రెసిడెంట్‌గా జిన్నూరి సురేష్, వైస్ ప్రెసిడెంట్‌గా వెణుతురుపల్లి సుబ్బు, సెక్రటరీగా పందిరి హరి, ట్రెజరర్‌గా గుమ్మళ్ళ నరేష్, జాయింట్ సెక్రటరీగా దుర్గేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని దస్తా వేజు లేఖర్లు అందరూ అభినందించారు. అనంతరం అమలాపురం సబ్ రిజిస్ట్రారు పరిధిలోని దస్తావేజు లేఖర్లు సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ 2.0లో జరుగుచున్న రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యలు, ఒటిపి. తదితర సమస్యలపై చర్చించారు.

నూతనంగా ఎన్నికైన దస్తావేజు లేఖర్లు సంఘ నాయకులు

అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ 2.0లో రిజిస్ట్రేషన్‌ల సమస్యలపై నెల్లూరు తదితర జిల్లాలో వివిధ సమస్యలపై ఆందోళలను, పెన్‌డౌన్ నిరసన కార్యక్రమాలపై చర్చించారు.ఈ నెల 19,20వ తేదీలలో అమలాపురం సబ్ రిజిస్ట్రారు కార్యాలయ పరిధిలో లేఖర్లు అందరూ పెన్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమం లో దస్తావేజు లేఖర్ల కన్వీనర్ మట్టపర్తి రాము, కడలి సత్యనారాయణ, సిహెచ్ వెంకట రామయ్య, వీరవల్లి పాలెం భూషణం, బొర్రా వెంకటేశ్వర రావు,యల్లమిల్లి, బుజ్జి, పథ్వి శ్రీవు,సిరిపల్లె మూర్తి, గుప్పి,సుబ్బయ్య, కె మహేష్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మూడు స్వర్ణ పతకాలు సాధించిన నిహారిక

కిక్ బాక్సింగ్‌లో నిహారికకు మూడు స్వర్ణ పతకాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎయులోని బాక్సింగ్ హాల్లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన కారుమూరి లేఖ నిహారిక మూడు స్వర్ణపతకాలు సాధించింది. కిక్ లైట్, పాయింట్ ఫైట్, క్రియేటివ్ ఫామ్ వెపన్, విభాగాల్లో 3 స్వర్ణపతకాలను, డి. హేమన్య క్రియేటివ్ ఫామ్ విభాగంలో స్వర్ణ పతకం పాయింట్ ఫైట్ విభాగంలో రజత పతకాన్ని నిహారిక సాధించారని కోచ్ బికె.రత్నం తెలి పారు. విశాఖపట్నం వెస్ట్ ఎంఎల్ఎ పివి.గణబాబు చేతుల మీదుగా పతకాలను అందజేశారు. ఈ పోటీలను స్టేట్ కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ జి.ఆనందబాలు నిర్వహించారు. విశాఖ ప్రెసిడెంట్ జోగారావు, సెక్రటరీ సిహెచ్.సంతోష్‌కుమార్, రాజమండ్రి కిక్ బాక్సింగ్ సెక్రటరీ ఎన్.గిరివెంకటరమణ ఈ పోటీలకు రెఫరీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ బల్లిపాటి కెంపురత్నం, కోచ్ యండమూరి అంజనీ కుమార్ తెలిపారు. స్వర్ణ పథకాల సాధించిన నిహారికను మంగళవారం పలువురు అభినందించారు.

కార్టూ'నిజం'

రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

పాశర్లపూడి లంక సొసైటీ ఛైర్మన్ వీరబాబు

ప్రజాశక్తి - మామిడికుదురు

సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన తేవాలి అందించేందుకు కృషి చేస్తానని ఛైర్మన్ అప్పన వీరబాబు అన్నారు. పాశర్లపూడి లంక సొసైటీ కార్యాలయములో మంగళవారం ఛైర్మన్‌గా వీరబాబు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు ఆయనతోపాటు పర్సన్ లుగా కుడిపూడి వెంకటేశ్వరరావు, ఇంజె నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రైతు సమస్యలు గుర్తించి వాటి పరిష్కార మార్గాలు చూపిస్తామన్నారు. పలువురు ఛైర్మన్‌కు, సభ్యులకు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తెల గారెడ్డి సూర్యప్రకాశరావు, లూటుకుర్రు సర్పంచ్ ఆడబాల తాతకాపు, మాజీ జడ్‌పిటిసి సభ్యుడు మద్దాల పెద్దకాపు, జనసేన నాయకులు విల్ల సుబ్బారావు, నగరం ఎఎంసి డైరెక్టర్ పితాని వెంకటేశ్వ రరావు, తెలగారెడ్డి ఏసు, కోలా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పన వీరబాబు

ఘనంగా సొసైటీ ఛైర్మన్ బుజ్జి పుట్టినరోజు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఐ.పోలవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ కాకర్లపూడి సత్య వెంకట రాయపరాజు(బుజ్జి) పుట్టినరోజు వేడుకలు మం గళవారం సొసైటీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో టిడిపి మండల అధ్యక్షులు రాయపురెడ్డి నీల కంఠే శ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సాగిరాజు సూరిబాబురాజు సమక్షంలో కేక్ కట్ చేశారు. పలువురు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు ఫోన్ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపురెడ్డి స్వామినాయుడు, గొట్టుముక్కల కొండ రాజు, పిన్నమరాజు శివ, బొంతు ప్రసాద్,మద్దిరెడ్డి కుమార్, చోడిశెట్టి వీరబాబు, దగుడు బియ్యం స్వామి నాయుడు, తోట వెంకటేష్, దేవు రాంబాబు, గుర్రాలశ్రీను, గుత్తాల లోవరాజు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు పాల్గొన్నారు.

బుజ్జికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న కూటమి నాయకులు

విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిషత్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నుంచి ఉత్తమ సేవా అవార్డు పొందిన ఎంపిడిఒ ఎ.రాజుకు మంగళవారం మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో అభినందించి, సన్మానించారు. ఇందులో భాగంగా ఆయనకు దుశ్శాలు వాలు కప్పి, పూల మాలలు అలంకరించి, బొకేలు, పూలకుండీలు అందజేసి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంపిడిఒ రాజు సేవలను కొనియాడుతూ వృత్తిలో ఆయన చూపి స్తున్న చొరవను, అనుభవంతో కూడిన మెలకువలను కిందిస్థాయి ఉద్యోగులకు తెలియజేయడంలో ముందుంటున్నారన్నారు. అలాగే సన్మాన గ్రహీత మాట్లాడుతూ వృత్తిలో ఎన్నో వడిదొడుకులు ఉంటాయని, వాటిని నిబద్ధతతో అధిగమిస్తూ సేవలు అందించా లన్నారు. అందుకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.అప్పాజి, హెచ్ఎం శివ రామ్‌కుమార్, సిఆర్‌పిలు జి.శ్రీను, శ్రీను, అపర్ణ, సిబ్బంది నాగేశ్వరి, శ్రీదేవి, యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ రాజును సత్కరిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

వెల్నెస్ సెంటర్ కోసం స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం ఆలమూరుకు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగా అనువైన స్థలం కోసం మంగళవారం ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో బృందం వివిధ స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వెల్నెస్ సెంటర్ మంజూరైనట్లు తెలిపారు. దీని నిర్మాణానికి గ్రామంలో ప్రభుత్వ భూములలో అనువైన స్థలం కోసం ప్రత్యేకంగా వివిధ ప్రదేశాలలో పరిశీలించామన్నారు. ఇందులో భాగంగా స్థానిక వినాయకుడి గుడి ఎదురుగా మండల కార్యాలయాలకు వెళ్లే రహదారి సమీపంలో నేడు పరిశీలించామన్నారు. అనువైన స్థలాన్ని గుర్తించి పంచాయతీ తీర్మానం చేసి నిర్మాణానికి ఎటువంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపల్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డి.సాయి కిషోర్, పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, కార్యదర్శి కె.మోక్షాంజలి, టిడిపి నేతలు మానేపల్లి శ్రీను, సాలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీకి బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్)కు అనుమతినిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి నుంచి ఉత్తర్వులు అందాయని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం కమిషనర్ ఛాంబర్ నందు మంగళవారం పట్టణ ప్రణాళిక అధికారి బి.రాజేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) మ్యాప్‌ను కమిషనర్ రవి వర్మ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) 2041ని వివరిస్తూ రాబోవు కాలంలో నగర పంచాయతీ అభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలపై ముందస్తు ప్రణాళిక కు 2014లో ప్రతిపాదనలు పంపగా, ఈ ప్రణాళిక కు అనుమతినిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జిఒ నెం.152ను విడుదల చేసిందని అన్నారు. దీని ప్రకారం నగర పంచాయతీ పరిధిలో 52.42 చదరపు కిలో మీటర్లలో భవన నిర్మాణాలు, లేఔవుట్లకు అను మ తులు ఇవ్వాల్సి ఉందని అన్నారు.ఈ బృహత్తర ప్రణాళికను గతంలో జారీ చేసిన జిఒ నెం.119, 275 లకు అనుగుణంగా అమలుచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సునీత, శివ, టౌన్ ప్లానర్స్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ బృహత్తర ప్రణాళిక మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

గిట్టుబాటు ధరల కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - అల్లవరం

రాష్ట్రంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి రైతు విభాగ అధ్యక్షులు జున్నూరి రామారావు విమర్శించారు. డి.రావులపాలెం గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయ పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పంటను పారవేసే పరిస్తితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. ఉల్లిపాయలు హోల్ సేల్ మార్కెట్లో కేజీ రూ.3, టమోటో కేజీ రూ.1.50 ఉందని ఈ రేటుతో రైతుకు కనీసం కూలీ ఖర్చులు వస్తాయా, బత్తాయి, అరటి, పొగాకు తదితర వంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారన్నారు. యూరియా కొరతని కూటమి ప్రభుత్వం నివారించలేక పోయిం దన్నారు. వైసిపి రాష్ట్ర వ్యాప్తం గా పోరాటాలు చేస్తే ప్రభుత్వం యూరియా కొరత లేదని ప్రకటనలు ఇవ్వడం బాధాకరమన్నారు. గత వైసిపి పాలనలో ధరల స్థిరీకరణతో రూ.3 వేల కోట్లు కేటాయించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నారని అన్నారు. యూరియా కొరత రాకుండా రైతుల అవసరాలను ముందుగా గుర్తించి ఆర్ బికెల ద్వారా రైతులకు సరఫరా చేశామన్నారు. కార్యక్రమ ంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు జున్నూరి రామారావు, అమ లాపురం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు కాండ్రేగుల జవహర్, నియోజ కవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు తిక్క ప్రసాద్, ఉప్పల గుప్తం మండలం ప్రధాన కార్యదర్శి శీలం సూరి బాబు విద్యార్థి విభాగం అధ్యక్షులు మామిడి శెట్టి సతీష్, బళ్ల శివ ,రైతు యాళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జున్నూరి రామారావు, వైసిపి నాయకులు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులంతా క్రమశిక్షణతో ఉండి, లక్ష్య సాధనకు కృసి చేయాలని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ అన్నారు. మండలంలోని అనాతవరం పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుని కె.రాధ అధ్యక్షతన 'మాదక ద్రవ్యాలు-చెడు వ్యసనాలపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎస్ఐ జ్వాలా సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల కు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్కా, సిగరెట్, ఖైనీ వంటి మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసిన సమాచారం అందించాలని అన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండి, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాకరానికి కృషి చేయాలని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుని రాధ మాట్లాడుతూ విద్యా ర్థులంతా సన్మార్గంలో నడిచినపుడే దేశభివృద్ధి సాకా రమౌతుందన్నారు. ఈ కార్యక్రమ ంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎ. అర్జునరావు, కె.తాతాజీ, ఎన్.తులసిభవానీలతో పాటు ఉపాధ్యా యులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొనారు.

విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ జ్వాలాసాగర్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో మంగళవారం ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సొసైటీ ఛైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం కూటమి నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్డుదారులు రేషన్ షాపునకు వెళ్లి వేలిముద్ర వేసి తమ స్మార్ట్ కార్డులను తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొత్తపల్లి రాంబాబు, సిరంగుల సతీష్, అడబాల ఆదినారాయణ, పామర్తి పేర్రాజు, అడబాల వీర్రాజు, అడబాల వెంకట్రావు, వితర్ఒలు జ్యోతి, సూర్య ప్రకాష్, డీలర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. మంగళవారం గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన నందిన సతీష్, నందిన హర్షివ్ వారి కుటుంబ సభ్యులు రూ.50,116, అలాగే రావులపాలెం చెందిన పులవర్తి దుర్గ అనూష, వారి కుటుంబ సభ్యులు రూ.31,485 విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

అన్నదాన పథకానికి విరాళం

ర్యాలి గ్రామంలో జగన్మోహిని కేశవ, గోపాలస్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదాన నిర్వహించేందుకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన మొదలి రామకృష్ణశర్మ జ్ఞాపకార్థ వారి సతీమణి లక్ష్మి రామ్ రూ.10,116 విరాళాన్ని ఆలయ ఇఒ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు.

ఎంఇఒ-2 గా రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నర్సిపూడి జడ్‌పి హైస్కూల్లో హెచ్ఎంగా విధులు నిర్వ హిస్తున్న నేదునూరు రాజును ఎఫ్ఎసి ఎంఇఒ-2గా నియమిస్తూ కాకినాడ స్కూల్ ఎడ్యుకేషన్ జోన్-2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఉత్తర్వులు వెలువరించారు. ఈ మేరకు రాజు ఎంఇఒ-2 గా మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఇఒ-1 బి.అప్పాజీ, ఎంపిడిఒ ఎ.రాజు, నాలుగు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సిఆర్‌పి ంటిలు, పిటిఐలు, ఎంఆర్‌సి సిబ్బంది నర్సి పూడి గ్రామ పెద్దలు ఆయన్ని అభినందించారు. ఆగస్టు 31 తో అప్పటివరకు ఎంఇఒ-2గా విధులు నిర్వహిస్తున్న పివి.సుబ్బరాజు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది.

ఓజోన్ పొర ఆవశ్యకతపై అవగాహన

ముమ్మిడివరం డిగ్రీ కళాశాలలో ఓజోన్ పొర పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - యంత్రాంగం
ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా ఓజోన్ పొర ఆవశ్యకతపై విద్యార్థులకు అధ్యాపకులు అవగాహన కల్పించారు. **ముమ్మిడివరం :** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళ వారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సూచన మేరకు సెప్టెంబర్ 16న జరిగే జరిగే అంతర్జాతీ య ఓజోన్ పొర పరిరక్షణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దీనిలో భాగంగా భూమికి సూర్యుని నుండి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి రక్షించే ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యత పై వివరిం చారు. కార్యక్రమంలో భాగంగా ఐక్యూఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.తులసి లక్ష్మీ, కెమిస్ట్రీ అధ్యాపకులు డి.పల్లంరాజుతో పాటు అధ్యాపక అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **మామిడికుదురు**: ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచంగా నిలుస్తోందని, పొరను పరిరక్షించుకుం దామని హెచ్ఎం రమాదేవి సూచించారు పాశర్లపూడి హైస్కూల్లో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు ఓజోన్-3 చిహ్నంగా కూర్చుని విద్యార్థులు గొడుగులతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. జీవక్షేత్ర ఉపాధ్యాయుడు చూరుమేను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్య క్రమం నిర్వహించారు. మామిడ కుదురు హైస్కూల్లో హెచ్ఎం బి.చిరంజీవిరావు ఆధ్వర్యంలో ఓజోన్ పొర పరిరక్షణలో భాగముగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. **రామచంద్రపురం:** పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో మంగళవారం

రామచంద్రపురం ప్రభుత్వ కళాశాలల్లో పాల్గొన్న అధ్యాపకులు


పాశర్లపూడి హైస్కూల్లో ఓజోన్ చిహ్నంతో విద్యార్థుల ప్రదర్శన

ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. రసాయన శాస్త్ర విద్యార్థులచే పోస్టర్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యకమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.రామకృష్ణ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఓజోన్ పొర ని సంరక్షించు కోవడానికి పర్యావరణ పరిరక్షణ కొరకై క్లోరోఫ్లోరో కార్బన్ల విడుదల తగ్గించేలా ప్రతి ఒక్కరూ తన వంతుగా కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కని నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమము లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మజ, రసాయన శాస్త్ర అధ్యాపకులు కె.. రాజేంద్ర ప్రసాద్, వి.గీత, బోటనీ అధ్యాపకులు డాక్టర్. పి.శారా, ఫిజిక్స్ అధ్యాపకులు కె.శ్రీను, విద్యా ర్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - శంఖవరం
అన్నవరంలో విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం అన్నవరం గ్రామ శివారులో నూతనంగా వేసిన లేఅవుట్ స్థలాల్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా బర్ల సోమరాజు విద్యుధాఘాతానికి గురియై మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్
అమలాపురం మండలం తాండవపల్లి పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి పంట కాలువలో సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయసు గల గుర్తు తెలియని పురుషుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న అమలాపురం తాలూకా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే తాలూకా పోలీస్ స్టేషన్లో ఈ నం. 9440796562, 9440796525లను సంప్రదించాలన్నారు.

బైకుల చోరీ ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - పెరవలి
అంతర్ జిల్లా బైకుల చోరీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ ఈ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం, అనపర్తి, విశాఖపట్నం, అమలాపురం పెనుగొండ, పెనుమంట్ర తదితర ప్రాంతాల్లో బైకుచోరీలు ఎక్కువ కావడంతో నిఘా పెట్టామన్నారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది, కొవ్వూరుకు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ బృందంగా ఏర్పడి పెరవలి సెంటర్‌లో తనిఖీలు చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన రికార్డులు లేనివారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. ఆరా తీయగా దొంగల ముఠాగా గుర్తించారని తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లికి చెందిన తుమ్మగంటి ధనుష్, నెక్కంటి యువరాజు, విశ్వనాధుల దేవిశ్రీప్రసాద్, రాజఒమ్మంగి గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి పాపారావు బృందంగా ఏర్పడి బైకులు చోరీ చేస్తున్నారని తలెఇపారు. వీరి నుంచి రూ.20లక్షల విలువైన 26 బైకులను రికవరీ చేశామని తెలిపారు. ఇంటి వద్ద తాళాలు వేసి ఉన్న మోటర్ బైకులను వీరు చాకచక్యంగా చోరీ చేస్తారన్నారు. సిఐ తిలక్ సహకారంతో ఈ ముఠాను పట్టుకున్న ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ ఎస్ఐ కె.సౌజన్య, కానిస్టేబుల్స్ కె.శ్రీహరి, కె.నరేంద్ర, ఎం.ముత్యాలు, ఎస్.గంగాధరరావు, ఎస్.ప్రసాద్, కె.రమేష్, ఎం.హనుమంతు, ఎన్.శ్రీనుపవన్, జి.సాంబయ్య, జాకీర్ రెహ్మాన్, అఫాసరి బేగ్, జి.అనిల్‌లను అభినందించి రివార్డులు అందించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దాపురం
ప్రేమించిన అమ్మాయి తిరస్కరించడంతో మనస్తాపం చెందిన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చెందాడు. రాజమహేంద్రవరం సంజీవ నగర్‌కు చెందిన కుసుమ ఎలీషా (22) అనే యువకుడు ఎడిబి రోడ్డు లోని చైతన్య పౌల్ట్రీలో పని చేస్తున్నాడు. ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె తిరస్కరించడంతో తన రూములో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

భార్య, భర్తలకు పదేళ్ల జైలు

ప్రజాశక్తి - పెద్దాపురం
మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఇరుగుపొరుగు ఇళ్లకు మధ్య వచ్చిన వివాదంలో ఆదిన ప్రసాద్, ఆదిన లక్ష్మిలు తమ పక్కింటి మహిళ పాలాని మంగ(60)ను మెట్లుపై నుంచి తోసివేయటంతో ఆమె మృతి చెందింది. 2022 డిసెంబర్ ఒకటతో తేదీన జరిగిన ఈ సంఘటనపై అప్పటి ఎస్ఐ పి.శివకుమార్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో వాదోపవాదాల అనంతరం పెద్దాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప భార్యాభర్తలకు ఒక్కొక్కరికి పదేళ్లు జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసును మొదట అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.కామేశ్వరరావు, తర్వాత అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గన్నంరాజు వినయ తేజ వాదించారు.


బాధ్యతలు స్వీకరించిన పాలక మండలి

పల్లాలమ్మ ఆలయ పాలక మండలి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కొత్తపేట
వానపల్లి గ్రామ దేవత శ్రీ పల్లాలమ్మ అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ గా మద్దింశెట్టి ఆదినారాయణను ఎన్నుకున్నారు. దీంతో ఈయన చైర్మన్ గా మూడుసార్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ కొత్తపేట మండలం నాయకులు హాజరయ్యారు. మద్దింశెట్టి ఆదినారాయణ, సబ్బితీ పల్లం రాజు, గంగుమళ్ల సుజాత, కంచు స్థంభం నరసింహారావు, దాసరి సూర్య కుమారి, వానపల్లి సాయిబాబు, దూనబోయిన అర్జున్ రావు, రవణం కనకమహాలక్ష్మి, వనుము కనక త్రివేణి సభ్యులుగా బండారు సంజీవ్ సమక్షంలో దేవస్థానం ఇఒ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో బండారు సంజీవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానంతో పాటు పల్లాలమ్మ తల్లి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే సత్యానంద రావు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆలయం అభివద్ధికి పాలకమండలి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ, గుబ్బల మూర్తి, గనిశెట్టి వీరేష్, బండారు వీరబాబు, పల్లి ఏసు, రెడ్డి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంఎల్‌సికి ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - మామిడికుదురు
మామిడికుదురు విచ్చేసిన ఎంఎల్ సి పేరాబత్తుల రాజశేఖర్‌కు మంగళవారం పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సిని ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సురేష్ బాబు, పిఆర్‌టి యు మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పళ్లంరాజు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఈలి శ్రీనివాస్‌కు సత్కారం

మామిడికుదురు సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఈలి శ్రీనివాసును ఎం ఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ శాలువ కప్పి ఘనముగా సత్కరించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారముపై సంఘం ప్రత్యేక దష్టి సారించిందని పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పళ్లంరాజు పేర్కొన్నారు. మండల పిఆర్‌టియు మలివిడత సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం కరవాక, గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు హై స్కూల్ లలో మరియు కరవాక, గోగన్నమఠం ,నగరం ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు యాళ్ళ పళ్లంరాజు, ప్రధానకార్యదర్శి చింతా రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్ బాబు, పెచ్చెట్టి నరసింహమూర్తి, లంకలపల్లి శ్రీమన్నారాయణ, వన్నెంరెడ్డి సాయిబాబా, ఎరుబండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం పిహెచ్‌సి వద్ద జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు స్వాతి

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రావులపాలెం
ప్రతీ గ్రామంలోనూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ అధికారి పిఎంసి వైద్యులు కె.స్వాతి అన్నారు. స్వస్థనారి సశక్త పరివార్ అభియాన్ విజవంతం చేయాలని ఆమె సూచించారు. మంగళవారం మండల పరిధి గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో వైద్యులు స్వాతి పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బలమైన కుటుంబాల కోసం ఆరోగ్యకరమైన మహిళలు ఉండాలని, వారి ఆరోగ్యం కాపాడుట కోసం ఈనెల17 నుంచి 02 అక్టోబర్ వరకు 16 రోజులు పాటు ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటుచేసిందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ డాక్టర్ బి.ధనలక్ష్మి, ఎంపిహెచ్ఇఒ భాస్కర్ రెడ్డి, ఎంపిహెచ్ ఎస్.భూసారపు సత్యనారాయణ, హెచ్‌వి కె.ఇందిర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం**: అంగర పిహెచ్‌సి, పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్‌డి.రత్నకుమారి ఆధ్వర్యంలో మం గళవారం స్వస్థనారి సశక్త పరివార్ అభియాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో అంగర ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, గ్రామ కార్యదర్శి ఆర్ మోహన్, ఎంపీహెచ్ఎస్ ఎం నాని బాబు, హెల్త్ విజిటర్ టి.మేరిమణి,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిపల్లిలో మహిళ నేత్రదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మంగయ్యమ్మ(ఫైల్)

మండలం లోని తాడిపల్లికి చెందిన మాధవరపు మంగయ్యమ్మ(65) సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు. టిడిపి నాయకుడు మాధవరపు ఆది నారాయణ భార్య మంగయ్యమ్మ మరణంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబం మంగయ్యమ్మ నేత్రాలను మంగళవారం బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు దానం చేశారు. ఈ నిర్ణ యం తో పలువురికి ఆదర్శంగా నిలిచిన ఆ కుటుంబాన్ని గ్రామస్తులు అభినందించారు.

డిగ్రీ కళాశాల లో హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీ భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందీ దేశ సంస్కతిక ఐక్యతను ప్రతిబింబిస్తుందన్నారు. హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ ఎన్‌వి.రమణ, డాక్టర్ ఎన్.లక్ష్మి, డాక్టర్ కె.శ్రీదేవి, ముఖ్య అతిథి అయిన కెవివి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో బొజ్జా తారకం వర్ధంతి

పోరాట యోధుడు తారకం

ప్రజాశక్తి - ముమ్మిడివరం
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు, మానవహక్కుల ఉద్యమ నేత, కవి రచయిత, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన పోరాట యోధుడు బొజ్జా తారకం అని రాజ్యాంగ పరి రక్షణ సమితి అధ్యక్షుడు పెనుమాల సుధీర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో మంగళవారం పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తారకం 9వ వర్ధంతి కార్యక్రమం శరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.తొలుత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, బొజ్జా తారకం విగ్రహాలకు సుధీర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సుమారు ఏడు దశాబ్దాల పాటు ప్రజాఉద్యమాల వెంట నడిచిన తారకం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ఉద్యమాలకు పెద్దదిక్కులా నిలిచారని కొనియాడారు. చూండురు, కారంచేడు, లక్సిం పేట, రామ చంద్రాపురం శిరోముండనం కేసులో బాధితుల పక్షాన నిలిచి న్యాయం పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వజ్రపు శరత్, తాటిపాక దుర్గ బాబు, జనిపల్లి సత్యనారాయణ, యడ్ల చిట్టీ బాబు, కాశి లాజర్, చుక్కా మనోజ్, కాలామహర్, నందిక ప్రసాద్, బూసి రాంబాబు లతో పాటు తారకం అభిమానులు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం:** స్థానిక కొంకాపల్లి భూపయ్య అగ్రహారం దగ్గర మంగళవారం దళిత సేన ఆధ్వర్యంలో దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేద్కర్ అధ్యక్షతన బొజ్జా తారకం వర్ధంతి నిర్వహించారు.తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డేవిడ్ అంబేద్కర్, వాకపల్లి హరీష్ కుమార్, సాపే రమేష్, బి.రాంబాబు, గోసంగి సంతోష్, కమిడి శామ్యూల్ జ్యోతి తదితులు పాల్గొన్నారు.

దళిత రణభేరి సభ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు
బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 24న విజయవాడలో ధర్నా చౌక్ వద్ద దళిత రణభేరి పేరుతో ధర్నా నిర్వహించనుంది. దీనికి సంబంధించి మండలంలోని బడుగువానిలంక లో బిఎస్‌పి కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య చేతుల మీదుగా మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. దళితుల పక్షాన నిలబడి పోరాడేందుకు రణభేరికి రాష్ట్రంలో ఉన్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అంబేద్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు అంతా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పల్లి కీర్తి, శ్రీను, రమేష్, జగదీష్, వీర్రాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో అన్నదానం

ప్రజాశక్తి - కొత్తపేట
కొత్తపేట గ్రామం పాత రామాలయం వీధిలో వినాయక చవితి సందర్భంగా అన్నదానం చేశారు. యువ నాయకులు బండారు సంజీవ్ పాల్గొని యాత్రికులకు అన్న ప్రసాదాన్ని ఆయన వడ్డించారు. ఆయన ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు ఆలయ కమిటీ వారు ఆలయ మర్యాద లతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం
యూరియాకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. మండలంలోని చిలకపాడు, కాల్దారి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, యూరియాకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం గురించి వివరించారు. అధిక యూరియా వాడడం వల్ల కలిగే అనర్థాలు, వివిధ ఎరువులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి తెలిపారు, సమగ్ర భూ పోషక యాజమాన్య పద్ధతులైన నానో ఎరువులు, ముఖ్యంగా నానో యూరియా, నానో డిఎపి వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సొసైటీ అధ్యక్షులు, రైతులు, విఎఎలు స్వప్న, సాయి పాల్గొన్నారు.

నేడు సీతానగరం మండల సమావేశం

సీతానగరం : నేడు సీతానగరం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం పది గంటలకు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎంపిపి గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరవ్వాలన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు
నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కమిటీ, అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సేవా భావం కలిగి ఉండాలని, ప్రతిపక్ష పార్టీకి కౌంటర్ ఇచ్చే దిశగా కార్యకర్తలు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడిగా ధూళిపూడి వెంకటరమణ(బాబి), ప్రధాన కార్యదర్శిగా కట్టా త్రిమూర్తులు, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంటపల్లి ఉమామహేశ్వరి, పితాని హేమలత, బిసి సెల్ మండల అధ్యక్షులుగా దంగేటి అన్వేష్, తెలుగు రైతు అధ్యక్షునిగా శ్రీకాళ సత్తిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. అతి త్వరలో మిగిలిన కార్యవర్గాన్ని, అనుబంధ సంఘాల కమిటీలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వేగేశ్న భాస్కర రాజు, వాడ్రేవు వీరబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, అల్లూరి రామకష్ణరాజు, గాదిరాజు సతీష్ , కొత్తూరు కాశీ ఈశ్వరుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐస్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

ప్రజాశక్తి - తాళ్లరేవు
మండలంలోని తాళ్లరేవు శివారు రెడ్డివారి పాలెంలోని గమిని ఐస్ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి గ్యాస్ లీక్ అవ్వడం తో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఐస్ తయారీలో వినియోగించే అమోనియా గ్యాస్ పైపు పగిలిపోవడంతో గ్యాస్ లీకై బయటికి వ్యాపించింది. దీంతో ఫ్యాక్టరీ ఆనుకుని ఉన్న గ్రామస్తులంతా కళ్ళ మండటం, కళ్లుతిరగడం వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. తరచూ ఇలా గ్యాస్ లీకవడం జరుగుతుందని, దాని వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలానికి కోరంగి పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకుని వివరాలు సేకరించారు. ఇలాంటి సంఘ టనలు పునరావృతం కాకుండా సంబంధిత అధి కారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు
సొసైటీల ద్వారా రైతుల అభివృద్ధికి త్రీ మెన్ కమిటీ కృషి చేయాలని ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. మంగళవారం కోరంగి సొసైటీ త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షులుగా కొప్పిశెట్టి శ్రీనాగ వీరభద్రేశ్వరరావు, సభ్యులుగా వాసంశెట్టి గోవిందు, ఏసూరి సత్తి రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - తాళ్లపూడి
సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.మనోజ్ కుమార్ అన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తాళ్లపూడి మండలంలోని ఉపాధ్యాయులను మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తాళ్లపూడి లోని శ్రీ పరస పద్మ రాజారావు జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఎం.రాజకుమారి, రామ్మోహన్ రావు, పి.శ్రీనివాస రావులను సత్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.శంకర్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.విజయబాబు, మండల ప్రధాన కార్యదర్శి టి.క్రాంతికుమార్, జిల్లా ఆడిట్ మెంబర్ రవి తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో పూడుకుపోయిన డ్రైయినేజీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

వ్యర్థాలతో నిండిన డ్రైయినేజీ

కె.గంగవరం మండలం పామర్రు గ్రామంలో దళితవాడలో గృహాల మధ్యలో వెళుతున్న డ్రెయినేజీ పూర్తిగా పూడుకు పోయింది. దీంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రెయినేజీలో వివిధ పశు కళేబరాలతో దుర్గంధం వెదజ ల్లుతూ చుట్టూ ఉన్నటువంటి వారు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఈ డ్రెయినేజీలో ఉన్న పూడిక తీయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీనివాసరావు పరిస్థితిని పరిశీలించారు. దీనిపై పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీలో పూడికను తీయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

11వ వార్డులో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైరపర్సన్ రాణి

వార్డుల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణి పర్యటన

ప్రజాశక్తి - మండపేట
మండపేట పట్టణం 11వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆ వార్డు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. వార్డులోని కమ్యూనిటీ హాలు, డ్రెయినేజీ మరమ్మతులు, అంబేద్కర్ పార్కు సుందరీకరణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, కోఆప్షన్ సభ్యులు జంగా శాంత కుమారి బాబులు, వైసిపి వార్డ్ ఇంచార్జి కనికెళ్ళ పల్లవి ప్రసాద్, ఎస్. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యానాం
ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు యానాంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్య శాఖ అధికారి టి.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి యానాం ఆధ్వర్యంలో సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పరంపేట, మెట్టకూరు, కనకాల పేట గ్రామాల్లో ఉప ఆరోగ్య కేంద్రాల వద్ద ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎసి కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - సామర్లకోట
సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రైతు భవన్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని మాట్లాడారు. పేరుకు పట్టణం అభివృద్ధి, గుర్తింపు పొందినా రైతాంగం మాత్రం అంతగా అభివృద్ధి చెందలేదన్నారు. కావున వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎంతో ప్రాధాన్యత ఉన్నదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులకు విలువైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గంతో ఎంఎసి మాజీ ఛైర్మన్ పాలకుర్తి శ్రీనివాసచార్యులచౌదరి ప్రమాణస్వీకారం చేయిం చారు. కమిటీ ఛైర్మన్‌గా అందుగుల మణికుమారి, వైస్ ఛైర్మన్‌గా సిద్ధు వెంకటకృష్ణ భవనారాయణ, ఇతర డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, నియోజక వర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ 4వ జిల్లా జడ్జి గారి కోర్టులో
G.O.P. 74/2025
Between:
1.శ్రీమతి అయలూరి మోహిని పార్వతి
2. అయలూరి కార్తికేయ ఈశ్వర జగన్నాధ్
(మైనర్ రిప్రెజెంటెడ్ బై మదర్ శ్రీమతి అయలూరి మోహిని పార్వతి) ...పిటీషనర్లు
మరియు
నిల్ ...రెస్పాండెంట్
టు :
ది జనరల్ పబ్లిక్
పైన తెలిపిన పిటీషనర్లు ఉభయులు పై నెంబరుగల పిటీషన్ G.O.P.74/2025 ను పై కోర్టువారి ముందు దాఖలు చేసి, షెడ్యూలు ఆస్తిలో మైనరైన 2వ పిటీషనరు యొక్క అనిర్దిష్ట వాటాను క్రియ పర్చుటకు అనుమతిని ఇవ్వవలసినదిగా కోరివున్నారు. ఈ పిటీషన్ పై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు వున్నను, వారు తమ అభ్యంతరములను **ది. 07-10-2025** వ తారీకు **ఉదయం 10 గంటలకు** పై కోర్టు వారి ముందు హాజరై తెలుపుకొనవచ్చును. లేనిచో అభ్యంతరములు లేనివిగా పరిగణంచి కోర్టు వారు ఈ పిటీషన్ పై తగు తీర్పును ఇవ్వగలరు. కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన జారి చేయడమైనది.
యస్.కె. మొహిద్దీన్
యస్. ఏజాజుద్దీన్, యస్.హజరత్ అలి,
అడ్వకేట్స్‌డో.నెం. 20-4-27,
మొహిద్దీన్ స్ట్రీట్, కాకినాడ.
సెల్: 9440109900
కాకినాడ.
ది. 16-09-2025

పాస్‌పోర్ట్ పడిపోయినది
అయినవిల్లి మండలం, మాగం గ్రామం, వి ఆర్ కాలనీకి చెందిన **నక్కా సుధారాణి,** C/o. నక్కా నరసింహమూర్తి కి చెందిన **Y3884419** నెంబరు గల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 18 సెప్టెంబరు 2025న మాగం, వి ఆర్ కాలనీ లో మా ఇంటి నుండి అనాతవరం వెళ్తూ ఉండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.
అడ్రస్: నక్కా సుధారాణి
C/o. నక్కా నరసింహమూర్తి, మాగం,
వి.ఆర్.కాలనీ, అయినవిల్లి మండలం- 533577
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 9010021164

మహారాజశ్రీ అమలాపురం గౌరవ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. No. 47/2018
O.S. No. 401/2013
Between:
D.Hr: తేతలి రాధాకృష్ణ రెడ్డి
AND
J.Dr: చిట్టూరి సునీత
ఈ నెంబర్ డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై కోర్టు వారి ఎదుట ది. 06-10-2025వ తేదీన ఉదయం 10.30 గం॥ లగాయతు వేలం కాబడును. కావలసినవారు వచ్చి యిస్తిహాజరు షరతులకు లోబడి పాడుకోవచ్చును.
షెడ్యూలు: (తూ॥గో॥జిల్లా) డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సబ్ రి., అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట J.Dr తాలూకు వేలం కావలసిన సొత్తు యొక్క షెడ్యూలు అమలాపురం మున్సిపాలిటీ నారాయణపేట, ఆర్.ఎస్. నెం. 430/2 లో పడమర వైపు 125 గజాలు = 104.5 Sq.mts లో 165 గజములలో 0.84 సెంట్లు పూరా హద్దులు.
తూర్పు: 'A' షేర్ ఇన్ ది సైట్ అండ్ లెట్రిన్స్ బాత్‌రూమ్స్. **దక్షిణం:** కాంపౌండ్ వాల్ ఆఫ్ కడిమెళ్ళ రవి. **పడమర:** మున్సిపాలిటీ సిమెంటు రోడ్. **ఉత్తరం:** కుడిపూడి సుబ్బారావు ఇల్లు.
సదరు హద్దుల మధ్య స్థలమైన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిలో డోర్ నెంబర్ 3-3-23/15 నిర్మించిన డాబా ఇంటితో సహా కిటికీలు, ద్వారబంధాలు, పై కప్పు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ మరియు దారి మార్గాలు, నీటి వనరులు సమస్తం ఈజిమెంట్ హక్కులతో సహా.
D.Hr. Value: Rs. 11,00,000/-
Amin Value: Rs. 16,00,000/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.వి.వి.ఎస్.మూర్తి (బాబీ)
అమలాపురం అడ్వకేట్, అమలాపురం
ది.14-09-2025 సెల్: 9848344577